నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
8 | మహబూబ్‌నగర్, ఆదివారం 9 ఫిబ్రవరి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

## రైతు మహాధర్నాను విజయవంతం చేయాలి

ఎన్నికల్లో వాగ్దానాలు చేసి రైతుల నోట్లో మట్టి కొట్టిన కాంగ్రెస్ సర్కార్‌ను ప్రశ్నించేందుకు ఈనెల 10వ తేదీన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోస్గికి రాబోతున్నారు. కొడంగల్ గడ్డపై నిర్వహించే రైతు మహాధర్నాను విజయవంతం చేయాలి. రైతులను మోసం చేసి దగా చేసిన కాంగ్రెస్‌కు పరిపాలించే అర్హత లేదు. 420 హామీలను అమలు చేస్తామని నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్ పై బీఆర్‌ఎస్ పోరాటం చేస్తున్నది. రైతులకు రూ.2లక్షల రుణమాఫీని వెంటనే పూర్తి చేయాలని.. రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాలు ఇవ్వాల్సిందే.. కేటీఆర్ రైతు మహాధర్నాకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలి.

*– పట్నం నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొడంగల్*

## కేటీఆర్ రాకతో ప్రత్యేక ఫోకస్..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పలు నియోజకవర్గాల్లో పర్యటించారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో పర్యటిస్తుండడంతో బీఆర్‌ఎస్ నేతలు భారీ ఎత్తున జన సమీకరణ చేసేందుకు సమాయత్తం చేస్తున్నారు. నారాయణపేట జిల్లాతోపాటు సమీప నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున రైతులను తరలించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన పథకాలు అమలు కాకపోవడంతో రైతుల్లో తీవ్ర నిరాశ వ్యక్తం అవుతున్నది. ఈ నేపథ్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటుడం ప్రాధాన్యత సంతరించుకున్నది.



- రేపు సీఎం ఇలాకా కోస్గిలో రైతు మహా ధర్నా

# కొడంగల్ గడ్డపై.. సమరశంఖం

- హాజరుకానున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు
- అన్నదాతలను భారీగా తరలించేలా బీఆర్‌ఎస్ కసరత్తు



కోస్గిలో రైతు మహాధర్నా సభకు స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 420హామీలను నెరవేర్చాలని బీఆర్‌ఎస్ కొడంగల్ గడ్డపై సమరశంఖం పూరించనున్నది. ఈ మేరకు సీఎం సొంత నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 10వ తేదీన నారాయణపేట జిల్లా కోస్గిలో నిర్వహించే రైతు మహాధర్నాలో పాల్గొంటున్నారు. దీని కోసం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా రైతులను భారీఎత్తున సమీకరిస్తున్నారు. ఆయా మండలాల్లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఇతర బీఆర్‌ఎస్ నేతలు మండలాల వారీగా కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి కేటీఆర్ రైతు సదస్సుకు భారీ ఎత్తున తరలించేలా ప్రణాళికలు రచించారు. ఒకవైపు కొడంగల్ నియోజకవర్గంలో లగచర్లలో రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్న కాంగ్రెస్ సర్కార్.. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు సంక్షేమ పథకాలను కోస్గి నుంచి ప్రారంభించడంతో.. ఈ నేపథ్యంలో కేటీఆర్ కోస్గి పర్యటన రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్నది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ చేపడుతున్న రైతు నిరసన మహాధర్నాలు విజయవంతం అవుతుండడంతో.. సీఎం ఇలాకాలో చేపట్టే రైతు మహాధర్నాకు వేలాదిగా తరలించి కాంగ్రెస్ శ్రేణులకు జలక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం కోస్గిలో జరిగే రైతు మహాధర్నాకు కేటీఆర్‌తో పాటు ఇతర బీఆర్‌ఎస్ నేతలు పెద్దఎత్తున హాజరుకానున్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని, రైతు భరోసా, ఆత్మీయ భరోసా అందజేయాలని.. సన్న వడ్లు అమ్మిన అన్నదాతలకు బోనస్ వెంటనే చెల్లించాలని తదితర డిమాండ్లతో ఈ మహాధర్నా చేపడుతున్నారు.

***కొడంగల్ గడ్డపై కేటీఆర్..***

సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రైతు మహా ధర్నాకు కేటీఆర్ హాజరు కాబోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రైతు నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కోస్గిలో చేపట్టిన మహాధర్నాకు కేటీఆర్ వస్తుండడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో గుబులు పుడుతున్నది. ఇటీవల సీఎం రేవంత్ ఇచ్చిన హామీల్లో భాగంగా నాలుగు పథకాలను కోస్గి మండలం చంద్రవంచ నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు ఆశించినంత జనం రాకపోవడంతో నిరాశపడ్డారు. పెద్ద ఎత్తున ప్రచారం చేసినప్పటికీ.. కాంగ్రెస్ అమలు చేసిన నాలుగు పథకాల లబ్ధిదారుల ఖాతాలో పడకపోవడంతో ఖంగుతున్నారు. ఈ నేపథ్యంలో కోస్గిలో జరిగే రైతు మహాధర్నాకు కేటీఆర్ వస్తుండడంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

***లగచర్లలో బలవంతంగా భూముల సేకరణ..***

కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో ఫార్మా క్లస్టర్ పేరిట గిరిజనుల భూములను లాక్కునేందుకు రేవంత్ సర్కార్ అనేక ప్రయత్నాలు చేసింది. ఇక్కడి రైతులు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తిప్పి కొట్టారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని జైలుకు పంపించినా.. బీఆర్‌ఎస్ నేతలను టార్గెట్ చేసిన గిరిజనుల రైతుల పక్షాన నిలబడ్డారు. చివరకు ఫార్మా క్లస్టర్ రద్దయింది. అయితే ఫార్మా క్లస్టర్ భూసేకరణ రద్దు చేస్తూ తిరిగి పారిశ్రామిక కారిడార్ పేరిట కొత్తగా భూసేకరణ చేపడుతున్నది. కొన్నిరోజులుగా రైతులు భూ సర్వేలను అడ్డుకుంటున్నారు. ప్రాణాలకు పోయినా సరే కంపెనీలు రానివ్వమని తెగేసి చెబుతున్నారు.

వందలాది మంది పోలీసుల సమక్షంలో లగచర్ల రైతులను భయపెట్టి పొలాలను సర్వే చేస్తున్నారు. అయినప్పటికీ రైతులు తిరగబడుతున్నారు. ఈ నేపథ్యంలో లగచర్ల రైతుల పక్షాన కూడా కేటీఆర్ గళం వినిపించే అవకాశం ఉంది.

## రైతు నిరసన దీక్షకు ఏర్పాట్లు

కోస్గి టౌన్, ఫిబ్రవరి 8: కొడంగల్ నియోజకవర్గం కోస్గి పట్టణంలో ఈనెల 10వ తేదీన చేపట్టనున్న రైతు మహాధర్నాకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తుడడంతో నిరసన దీక్ష సభ ఏర్పాట్లను శనివారం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పరిశీలించారు. సోమవారం ఉదయం 10 గంటలకు కోస్గి మున్సిపాలిటీలోని జూనియర్ కళాశాల మైదానంలో రైతు నిరసన దీక్షకు ఏర్పాటు చేస్తున్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నడంతో పెద్దఎత్తున రైతులను సమీకరించేందుకు మాజీ ఎమ్మెల్యే సమాయతమవుతున్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటించి కార్యకర్తల సమావేశంలో జన సమీకరణపై దిశా నిర్దేశం చేశారు. కొడంగల్ రైతు మహాధర్నా పేరుతో నిర్వహించే కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూడా హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో కోస్గి పట్టణంలో సభా ప్రాంగణం ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే దగ్గరుండి పరిశీలించారు. రైతులు పెద్దఎత్తున తరలివస్తుండడంతో గ్యాలరీల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే వెంట స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ సభ్యుడు సలీం, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ శాసం రామకృష్ణ, నాయకులు సాయిలు, జనార్దన్‌రెడ్డి, వెంకట నర్సింహులు ఉన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూర్ (కొత్తపల్లి) ఫిబ్రవరి 8 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన రైతులు అడుగడుగునా మోసపోతున్నారన్నారు. గతనెల 26వ తేదీ కోస్గి మండలంలో చంద్రవంచలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నాలుగు సంక్షేమ పథకాలకు అంకురార్పణ చేస్తున్నట్లు ప్రకటించినా నేటికి ఏఒక్క పథకాన్ని సంపూర్ణంగా అందించిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతులను ఆదుకునేందుకు కరోనా లాంటి కష్టకాలంలో కూడా రైతు బంధు డబ్బులను వారి ఖాతాల్లో జమ వేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. రైతు రుణమాఫీ అంటూ మూడు దఫాలుగా రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ సర్కార్ నేటికీ పూర్తిస్థాయిలో కానందున రైతులు బ్యాంకుల్లో వడ్డీలు చెల్లించలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. అలాగే ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.2500 అందజేస్తామని హామీ ఇచ్చి నేటికీ ఈ పథకం ఊసేలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన కోస్గి పట్టణంలో నిర్వహించే రైతు నిరసన దీక్షకు నియోజకవర్గంలోని కార్యకర్తలు,నాయకులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమానికి బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సబితా ఇంద్రారెడ్డి హాజరవుతారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మద్దూర్, కొత్తపల్లి మండల అధ్యక్షుడు, వంచర్ల గోపాల్, మధుసూధన్‌రెడ్డి, నాయకులు సలీం, వీరారెడ్డి, బసిరెడ్డి, జగదీశ్వర్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

- బీసీ బహుజన రాజ్యాధికార సమితి అధ్యక్షుడు మైత్రి యాదయ్య




అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 8 : బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ బహుజన రాజ్యాధికార సమితి అధ్యక్షుడు మైత్రి యాదయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన ఆధ్వర్యంలో బీసీ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా చేసిన కులగణనలో బీసీలను తగ్గించి చూపడం కుట్రపూరితమని ఆరోపించారు. అదే విధంగా భారత రాజ్యాంగం స్ఫూర్తికి విరుద్ధంగా ప్రస్తుత రాజకీయాలు జరుగుతున్నాయని, సాధించుకున్న తెలంగాణను మళ్లీ సంపన్న వర్గాలే రాజ్యం ఏలుతున్నాయని, బడుగు బలహీన వర్గాలను యాచించేస్థాయికి పరిమితం చేశారన్నారు.

బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తూ సంక్షేమ పథకాలను న్యాయపరంగా రావాల్సిన వాటాను రానీయకుండా విద్య, ఉపాధి రంగాల్లో దామాషా ప్రకారం దక్కకుండా కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బీసీలను ఇంకా బీదరికంలోని నెట్టేస్తున్నారని, ఇప్పటికైనా మారాలన్నారు. కార్యక్రమంలో బుక్క మోహన్‌బాబు, కదిరి అంజ య్య, మడివాల నగేశ్‌కుమార్, బాలరాజ్ , కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బీసీలను తక్కువ శాతం చూపించే కుట్ర



కులగణనపేరుతో బీసీలను తక్కువగా చూపించేందుకు కాంగ్రెస్ సర్కార్ కుట్రచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 21లక్షల మంది బీసీలు కాంగ్రెస్ సర్కార్‌లో లెక్కల్లో లేకుండా పోయారు. ఇందుకు రేవంత్‌సర్కార్ సమాధానం చెప్పాలి. కులగణనలో ఓసీలు 10శాతం మాత్రమే ఉంటే 15శాతం చేసి చూపించారు. కాంగ్రెస్ సర్కార్ బీసీలను చంపే ప్రయత్నం చేస్తుంది. బీసీలను మోసం చేసేందుకే కులగణన కాంగ్రెస్ చేపట్టింది. రిజర్వేషన్ల ముసుగులో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పుల తడకగా ఉంది. బీసీలను అణచివేసే ప్రయత్నంగానే కులగణన చేపట్టారు. రాజకీయంగా ఎదగకుండా చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆడుతున్న నాటకం ఇది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమగ్రకుటుంబ సర్వే చేసినప్పుడు 51శాతం ఉన్న బీసీ జనాభా ప్రస్తుతం 46శాతానికి పడిపోయిందంటే కుల గణన ఎలా చేశారనేది అర్థమవుతుంది. బీసీలకు కామారెడ్డి సభలో డిక్లరేషన్ ఇచ్చిన విధంగా 42శాతం అమలు చేస్తామని చెప్పి గద్దెనెక్కి ఇప్పుడు మోసం చేసి బీసీలను అణగదొక్కే ప్రయత్నం కాంగ్రెస్ సర్కారు చేస్తున్నది. బీసీలను తక్కువ చేసి చూపిస్తున్న రేవంత్‌రెడ్డికి రాబోయే రోజుల్లో బీసీలే తగిన బుద్ధి చెబుతారు.

*– కురువ పల్లయ్య, బీఆర్‌ఎస్‌వీ గద్వాల జిల్లా కోఆర్డినేటర్*

## మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర..



ఆత్మకూరు, ఫిబ్రవరి 8: కులగణనతో మరోసారి కాంగ్రెస్ కుట్రలు బయటపడ్డాయి. అగ్రవర్ణాలకు తలొగ్గిన కాంగ్రెస్ సమాజంలో 60శాతం బడుగులుంటే ఓసీల సంఖ్యను పెంచింది. బీఆర్‌ఎస్ హయాంలో 52శాతం ఉన్న బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం 46 శాతంగా చూపెట్టడం విడ్డూరంగా ఉంది. బీసీలను తక్కువగా చూపెట్టి ఓసీలను ఎక్కువగా చూపెట్టడం పెద్దకుట్ర. చాపకింద నీరులా కుట్రలు పన్నుతూనే పైనుంచి 42శాతం సీట్లు ఇస్తామని కాంగ్రెస్ చెప్పడం కాంగ్రెస్ కుట్ర రాజకీయాలకు తార్కాణం. బీసీ జనాభా ఏ కారణంగా తగ్గిందో ప్రజలకు చెప్పాలి. బీసీలతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వం సరిగ్గా పాలన చేయలేదు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి పునఃసమీక్ష చేపట్టాలి. నిపుణుల ఆధ్వర్యంలో మరోసారి సమగ్ర సర్వే నిర్వహించాలి. బీసీలకు అన్యాయం జరిగితే న్యాయ పోరాటం చేస్తాం. బీసీల హక్కులను కాపాడే దిశగా అన్ని రాజకీయ, సామాజిక పక్షాలు ఉద్యమించాలి. సమగ్ర లెక్కలు బయటకి తీసి ఎవరెవ్వరు ఎంత శాతమున్నారో తేల్చాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి.

*–కె.కోటేశ్వర్, మాజీ వైస్‌ఎంపీపీ ఆత్మకూరు*

## అగ్రవర్ణాల కోసమే తప్పుల తడకగా సర్వే..



కాంగ్రెస్ సర్కారు చేపట్టిన కులగణన బీసీలనే కాదు అన్ని కులాలను తక్కువ చేసి కేవలం అగ్రవర్ణాలకే అధిక ప్రాధాన్యత కల్పించింది. సర్వే మొత్తం పూర్తి తప్పుల తడకగా చేసినట్లు జనాభా నిష్పత్తిని చూస్తే తెలుస్తోంది. రేవంత్ సర్కారు కావాలనే బీసీ జనాభాను తగ్గించి చూపే ప్రయత్నం చేసినట్లు అర్థమైతుంది. గతంలోకంటే ఇప్పుడు బీసీల జనాభా ఎలా తగ్గుతారో ప్రభుత్వం స్పష్టంచేయాలి. కేసీఆర్ సర్కారు చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల లెక్క పక్కాగా తేలింది. అలాంటిది ఇప్పుడు ఎందుకు తగ్గిందో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఎట్టి పరిస్థితుల్లో ఈ కులగణనను ఒప్పుకోం. బీసీ ఓట్లతో గెలుపొందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు వారికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించకపోవడం విచారకరం. వెంటనే ప్రభుత్వం మరోమారు పారదర్శకంగా బీసీల కులగణన చేపట్టి దానికి చట్టబద్ధత కల్పించాలి. 2011 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో బీసీల జనాభా పెరిగిందే కాని తగ్గలేదు. గతంలో 7 శాతం ఉన్న ఓసీలు ఇప్పుడు 16శాతానికి ఎలా పెరిగారో ప్రభుత్వ పెద్దలు సమాధానం చెప్పాలి. ఇది కేవలం ఈడబ్ల్యూఎస్ కోటాను కాపాడుకోవడానికి చేసిన ఎత్తుగడలో భాగంగా కనిపిస్తుంది. జనాభా పెరిగితే బీసీ రిజర్వేషన్లు పెంచాల్సి వస్తద ని ప్రభుత్వమే తగ్గించి చూపుతున్నది. నిజంగా బీసీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే గ్రామాల వారీగా కులగణన రిపోర్టుల ను ప్రకటించాలి. బీసీల రిజర్వేషన్ 50 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి.

*– తెలుగు సురేందర్, బీసీ పొలిటికల్ జేఏసీ మండలాధ్యక్షుడు, ఆత్మకూరు*

## ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

బిజినేపల్లి, ఫిబ్రవరి 8 : మండలంలోని వట్టెం నవోదయ జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి గానూ 9,11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ తెలిపారు. 11వ తరగతి ప్రవేశం కోసం 3,369 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 2733 మంది హాజరై 536 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అదేవిధంగా 9వ తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించిన 1,647మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 1,327 మంది విద్యార్థులు హాజరై 319 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. రెండు ప్రవేశ పరీక్షలకోసం 20 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 11వ తరగతికి సంబంధించిన 14పరీక్షా కేంద్రాలు, 9వ తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించి 6పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, బిజినేపల్లి మండలాల్లోని జవహర్ నవోదయ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలను రెవెన్యూ, విద్యాశాఖాధికారులు తనిఖీ చేసినట్లు తెలిపారు.

## మా భూములివ్వం

- ప్రాణాలు ఫణంగా పెట్టైనా కాపాడుకుంటాం
- నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ సర్వేను వ్యతిరేకిస్తూ అడ్డుకున్న కాట్రేవ్‌పల్లి రైతులు
- చేసేది లేక వెనుదిరిగిన అధికారులు



కాట్రేవ్‌పల్లిలో సర్వే చేయడానికి వెళ్లిన అధికారులతో వాగ్వాదానికి దిగిన కాట్రేపల్లి రైతులు

మక్తల్, ఫిబ్రవరి 8 : నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకానికి మా భూములు ఇవ్వమని నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాట్రేవుపల్లి రైతులు తెగేసి చెప్పారు. శనివారం నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా అధికారులు మక్తల్ మండలం కాట్రేవుపల్లిలో భూముల సర్వే చేపట్టడానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆ గ్రామ రైతులు వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్న మా లాంటి రైతులు భూములు ప్రభుత్వం లాక్కోవాలని చూస్తే ఎలా అని అధికారులను నిలదీశారు. ప్రభుత్వం జీవో నెంబర్ 69 పేరుమీద మక్తల్ మండలం భూత్పూర్ రిజర్వాయర్ నుంచి ఏడు టీఎంసీల నీటిని తరలించేందుకు ప్రభుత్వం చేపడుతున్న నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా, భూములను రైతుల నుంచి తీసుకొని పైపులైన్ ద్వారా నీటిని తరలించే ప్రక్రియ పనులను వేగవంతం చేస్తున్న నేపథ్యంలో కాట్రేపల్లి గ్రామంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎలాంటి సమాచారం అందించకుండా ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూ సర్వేను చేయడానికి అధికారులు వచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామ రైతులు మూకుమ్మడిగా సర్వే పనుల వద్దకు చేరుకొని భూములు ఇచ్చేది లేదని, సర్వే చేయవద్దని, అయినా ఎలాంటి నోటీసులు, సమాచారం ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజు అనే రైతు తనకున్న 24 ఎకరాలు మొత్తం నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూమి పోతే ఎలా జీవించాలని అధికారులను నిలదీశారు. మిగతా రైతులు కూడా మా భూములు ఇవ్వమని సర్వే పనులను అడ్డుకోవడంతో మక్తల్ తాసీల్దార్ సతీశ్‌కుమార్ ఆర్డీవో రామచంద్రతో ఫోన్‌లో మాట్లాడి రైతులను ఒప్పించే ప్రయత్నం చేసినప్పటికీ రైతులెవ్వరు సర్వేకు ఒప్పుకోలేదు. అధికారులు చేసేది లేక గ్రామం నుంచి వెనుదిరిగారు.

## రాత్రి జీవో ఇచ్చారు.. ఉదయం మాట మార్చారు

- రేషన్‌కార్డుల దరఖాస్తులపై ప్రజల ఆవేదన
- మీ సేవ సెంటర్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకునేలోపు నిలిపివేత

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 8 : రేషన్ కార్డుల దరఖాస్తు వ్యవహారంలో ప్రజలు నుంచి విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే వెంటనే పేదలందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలు అయిపోయి ఏడాది దాటినా ఇప్పుడు..అప్పుడు అంటూ కాలాయాపన చేస్తూ వచ్చారు. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి జనవరి నెలలో రేషన్ కార్డులు అందజేస్తామని వెల్లడించి కాలాయాపన చేశారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడేమో రేషన్ కార్డులకు సంబంధించి రేపటి నుంచి మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఉదయం మీ సేవ కేంద్రాల్లో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెళ్తే..దరఖాస్తులు తీసుకోవద్దంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని మీ సేవ నిర్వాహకులు చెప్పడంతో ప్రజలు అయోమయంలో పడ్డారు. రాత్రి జీవో జారీ చేసి దరఖాస్తు చేసుకోమన్నారు..ఉదయానికి మాట మార్చి దరఖాస్తు తీసుకోకుండా వ్యవహరించడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వానికి రేషన్ కార్డులు ఇచ్చే ఉద్దేశం ఉందా అంటూ.. మీ సేవ కేంద్రాల నిర్వాహకులను ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మేము వ్యవహరిస్తాం తప్పా తమ చేతుల్లో ఏమి లేదని సెంటర్ నిర్వాహకులు ప్రజలకు వివరిస్తున్నారు. గత ప్రభుత్వం మాట మీద నిలబడిందని, ఈ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు చెప్పి అధికారం వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు పూర్తి చేయలేకపోతుందని విమర్శిస్తున్నారు

### నేటి వరకు స్పష్టత లేదు..

ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం దాటిపాయే..కానీ ఏం లాభం లేదు. రుణమాఫీ పూర్తిగాచేయలేదు. రైతు భరోసా నేటికి వరకు ఇవ్వలేదు. రేషన్ కార్డులైయితే ఇప్పుడు అప్పుడు అంటూ ఊరించి... చెప్తున్నారు తప్పా రేషన్ కార్డులు ఇవ్వడం లేదు. శుక్రవారం రాత్రి మీ సేవ కేంద్రాల్లో రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో శనివారం మీ సేవ సెంటర్‌కు వచ్చి దరఖాస్తు చేసుకుందామని వస్తే...దరఖాస్తు తీసుకోవద్దని అధికారులు చెప్పారని సెంటర్ నిర్వాహకులు చెప్పారు. ప్రభుత్వం నేటి వరకు సరిగ్గా స్పష్టత లేదు.

*– వెంకటేశ్వర్ రెడ్డి, రేషన్ కార్డు దరఖాస్తుదారుడు, ధరూర్ మండలం*

### ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెప్పాం

రేషన్ కార్డులకు సంబంధించి శుక్రవారం జీవో వచ్చింది వాస్తవమే. కానీ మళ్లీ ఉన్నతాధికారులు దరఖాస్తులను తీసుకోవద్దని తెలపడంతో మీ సేవ సెంటర్ నిర్వాహకులకు దరఖాస్తు తీసుకోవద్దని సూచించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మేము వ్యవహరిస్తాం అంతే.

*–శివ కుమార్(ఈ డిస్టిక్ మేనేజర్)*

## తేనెటీగల దాడిలో నలుగురికి గాయాలు

ధన్వాడ , ఫిబ్రవరి 8 : తేనెటీగల దాడిలో నలుగురికి గాయాలైన ఘటన ధన్వాడలోని వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోని గువ్వలపల్లి చెన్నప్ప ఇంటి దగ్గర శనివారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం పాఠశాల విద్యార్థులు చెట్టుకు ఉన్న తేనె తుట్టెను రాళ్లతో కొట్టడంతో ఒక్కసారిగా తేనెటీగలు చెలరెగి సమీపంలో ఉన్న గంధం నర్సింహ, పాతపల్లి బాలప్ప, తిక్క నర్సింహ, సింగిల్ విండో డైరెక్టర్ బీఆర్‌ఎస్ నాయకురాలు భాగ్యమ్మపై దాడి చేశాయి. నర్సింహ పరిస్థితి కొంత విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం నారాయణపేట ఏరియా దవాఖానకు రెఫర్ చేశారు. మిగతా వారిని ధన్వాడ ప్రభుత్వ దవాఖానలోనే చికిత్సలు నిర్వహించి ఇంటికి పంపించారు